క్లుప్తంగా

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు


శనగల బసవన్నకు పూజలు చేస్తున్న అర్చకులు


విశేష అలంకరణలో వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వరస్వామికి నూతన వస్త్రసమర్పణ, విశేషార్చన, నానబెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతం, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు చేసి హారతులు పట్టారు.

మహానందిలో తగ్గిన సందడి


భక్తులు లేక బోసిపోయిన ఆలయ ప్రాంగణం

మహానంది: సెలవులు ముగియడంతో పాటు వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని కొద్ది రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మంగళవారం భక్తులు లేక ఆలయ ప్రాంగణాలు నిర్మానుష్యంగా కనిపించాయి. సాయంత్రం కొద్దిపాటి జల్లులు కురవడంతో భక్తులు తడవకుండా ఉండేందుకు మండపాలు, షాపుల వైపు పరుగులు తీశారు.

కూలిన భారీ వృక్షం


ఇంటిపై విరిగిపడిన చెట్టు

మహానంది: భారీ గాలులు వస్తే చాలు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూడు రోజుల నుంచి వరుసగా సాయంత్రం వేళలో భారీ గాలులు, వర్షం రావడంతో పలు చోట్ల భారీ వృక్షాలతో పాటు రేకుల షెడ్ల పైకప్పులు, గుడిసెలు దెబ్బతింటున్నాయి. తాజాగా సోమవారం రాత్రి వచ్చిన భారీ గాలులకు అబ్బీపురంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంగణంలో ఉన్న ఓ చెట్టు విరిగి మిద్దెపై పడడంతో అందులో ఉన్న వారు ప్రాణ భయంతో పరుగులు పెట్టి బయటికి వచ్చారు. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

పగిడ్యాల: మండలంలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఆయన సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయ సాయం అందించాలని ఆదేశించారు. అర్జీదారుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి రోజు డే, నైట్ బీట్‌లు చేపట్టాలన్నారు. స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ కేసుల్లో పురోగతి సాధించాలని చెప్పారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించరాదని, రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు.

బడుల మూసివేతకు ‘విలీనం’ నాంది!

- 3, 4, 5 తరగతులతో మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు
- చాలీచాలని గదులతో తరగతుల నిర్వహణ
- 1, 2 తరగతుల్లో అరకొరగా విద్యార్థులు
- పాఠశాలలు మూతపడే అవకాశం
- మండలంలో 8 పాఠశాలల విలీనం

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన చేపట్టి తీర్చిదిద్దింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అర్థం పర్థం లేని నిర్ణయాలతో ఉన్న బడులను మూసేస్తోంది. ఇందుకు తరగతుల విలీనం, కొత్త పాఠశాలల ఏర్పాటు అని కలరింగ్ ఇస్తుండటం విశేషం. దీంతో జూపాడుబంగ్లా మండలంలో అధిక శాతం స్కూళ్లు మూతపడుతున్నాయి. వసతులు లేకపోయినా నూతన పాఠశాలలను ప్రారంభించడం ఏకపక్ష నిర్ణయాన్ని చాటుతోంది. మొత్తానికి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.



మండ్లెం మోడల్ ప్రైమరీ పాఠశాలలో డెస్కులేక కింద కూర్చొని విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, మండ్లెం దళితకాలనీలోని ప్రాథమిక పాఠశాల

జూపాడుబంగ్లా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా యత్నిస్తుండటంతో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు ఉన్నత పాఠశాలలు 8, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ప్రాథమిక పాఠశాలలు 27 ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నంబర్ 117ను సవరించి 19, 20, 21జీవోలను విడుదల చేసింది. దీంతో గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసి ఓ మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామాల్లోని పాఠశాలలను విలీనం చేయటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో..

మండలంలో 27 ప్రాథమిక పాఠశాలలుండగా అందులో ఎనిమిది ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5, తరగతుల విద్యార్థులను విలీనం చేయగా ఆయా పాఠశాలల్లో 1, 2 తరగతుల విద్యార్థులు కేవలం 20లోపు ఉండటంతో అప్పుడో ఇప్పుడో ఆ పాఠశాలలు మూతపడే అవకాశాలండతో విద్యార్థుల తల్లిదండ్రులకు దిక్కుతోచడం లేదు. ప్రస్తుతం మండలం వ్యాప్తంగా ఫౌండేషన్ స్కూళ్లు (1,2 తరగతులు) 8, బేసిక్ ప్రైమరీ (1 నుంచి 5 వరకు ఉండి 60కంటే తక్కువ మంది విద్యార్థులుండేవి)స్కూళ్లు 13, మోడల్ ప్రైమరీ స్కూళ్లు(1 నుంచి 5 తరగతులు 60 కి పైబడి విద్యార్థులుండేవి)స్కూళ్లు 9, ఉన్నత పాఠశాలలు (6 నుంచి 10 వరకు) 9, ఒకటి నుంచి 10 వరకు ఉన్న హైస్కూల్ 1 చొప్పున మొత్తం 40 పాఠశాలలున్నాయి.

ఏడు పాఠశాలల్లోని తరగతులు విలీనం..

మండ్లెం దళిత కాలనీలోని స్పెషల్ స్కూల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను విలీనం చేశారు. జూపాడుబంగ్లా ఏపీ క్వార్టర్స్ ప్రాథమిక పాఠశాల, నీలిపల్లె పేటలోని ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను జంగాలపేటలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చారు. అలాగే పారుమంచాల గ్రామంలోని దళిత కాలనీలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాల, బైరెడ్డినగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను పారుమంచాల మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసి మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చారు. తర్తూరు దళితవాడలోని స్పెషల్ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5, తరగతులను 2కి.మీ. దూరంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. తూడిచెర్ల బైరెడ్డినగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను రెండు కి.మీ. దూరంలో ఉన్న తూడిచెర్ల మెయిన్ పాఠశాలలో విలీనం చేశారు. కనకయ్యకొట్టాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను రెండు కి.మీ. దూరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు కనీసం 60 మంది విద్యార్థులుంటే ఆ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది.


కర్నూలు-గుంటూరు రహదారి పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ పాఠశాల

పాఠశాలలు మూతపడే అవకాశం..

నిబంధనల ప్రకారం తూడిచెర్ల, కనకయ్యకొట్టాల, తర్తూరు, మండ్లెం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున, పారుమంచాల, జూపాడుబంగ్లాలో రెండు చొప్పున పాఠశాలల్లో ప్రస్తుతం 1, 2 తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో 1, 2 తరగతుల్లో కేవలం 15 నుంచి 30లోపు విద్యార్థులు మాత్రమే ఉండగా.. వారికి ఓ ఉపాధ్యాయుడిని నియమించారు. ఆయన సెలవుపెట్టినా, విధుల్లో భాగంగా ఎంఈఓ, డీఈఓ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చినా పాఠశాలలు మూతపడతాయి. పాఠశాల మూతపడకుండా ప్రస్తుతం ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను అక్కడికి పంపుతున్నారు. 1, 2 తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పిస్తే పాఠశాలలు మూతపడే అవకాశాలున్నాయి.

రెండు పాఠశాలలు అప్‌గ్రేడ్.. ఓ పాఠశాల డౌన్‌గ్రేడ్..

విచిత్ర లీలల్లో భాగంగా తాటిపాడు, తంగడంచ గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలలుగా మార్చారు. పారుమంచాల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను డౌన్‌గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలగా మార్చారు.

సౌకర్యాలు కరువు..

మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే కూటమి ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేయటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిపడ తరగతి గదులు, డెస్కులు, మినరల్‌వాటర్, టాయ్‌లెట్లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు లేకుండా మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటుచేయడం ప్రభుత్వ తీరును చాటుతుంది.

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేశాం



విద్యాశాఖ కమిషనర్, డీఈఓ ఉత్తర్వుల మేరకు మండలంలోని నిర్ణీత పాఠశాలలను విలీనం చేయాలని జారీ చేసిన ఆదేశాలను అనుసరించి వారు సూచించిన పాఠశాలలను సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేయాలని పాఠశాలల హెచ్ఎంలను ఆదేశించాం. ఆ మేరకు 3, 4, 5 తరగతుల విద్యార్థులను నిర్ణీత ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేశాం. – చిన్నమద్దిలేటి, ఎంఈఓ–1, జూపాడుబంగ్లా

ఇష్టానుసారంగా విద్యుత్ కోతలా?


అధికారులను నిలదీస్తున్న తలముడిపి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: విద్యుత్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా కోతలు విధిస్తున్నారని, అసలు ఎందుకు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారో చెప్పాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిలదీశారు. మంగళవారం మిడుతూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ.ఏ సమయంలో కరెంట్ వస్తుందో .రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. బోర్ల కింద వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిడుతూరు–గార్గేయపురం రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆర్‌అండ్‌బీ ఏఈ మనోధర్‌పై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఏఈ మండలానికి ఎప్పుడు వస్తారో కనీసం తమకు కూడా తెలియడం లేదని మండిపడ్డారు. గతంలో జలకనూర్ ప్రభుత్వ పాఠశాలలో 110 మంది విద్యార్థులు ఉంటే ఇప్పుడు 47 మంది మాత్రమే ఉన్నారని, ఇది తెలిసినా ఎంఈఈ పాఠశాలను ఎందుకు తనిఖీ చేయడం లేదని సర్పంచు ఎల్లయ్య ప్రశ్నించారు. తలముడిపి గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు రస్తా చూపించాలని ఆరు నెలల నుంచి తిరుగుతున్నా తహసీల్దార్ శ్రీనివాసులు పట్టించుకోవడం లేదని సర్పంచు వెంకటేశ్వర్లు సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ దశరథరామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న మస్తానయ్య

ఆత్మకూరు: క్షయవ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ మస్తానయ్య అన్నారు. మంగళవారం మండలంలోని నాగలూటి చెంచుగూడెంలో టీబీ నిర్మూలన కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు ఉన్న వారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. 60 ఏళ్లు నిండిన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేస్తామని తెలిపారు. టీబీ రోగులు ఆరు నెలల పాటు మందులు వాడాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దీపికాభాయి, ఆరోగ్య కార్యకర్త భాస్కర్ పాల్గొన్నారు.

పంటలకు బీమా చేయించుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ నాగేశ్వరరెడ్డి

మహానంది: రైతులు పంటలకు బీమా చేయించుకోవాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా చేయించుకోవచ్చని ఏఓ నాగేశ్వరరెడ్డి తెలిపారు. నందిపల్లె, సీతారామపురం గ్రామాల్లో మంగళవారం పర్యటించి రైతులకు సూచనలివ్వడంతో పాటు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. వరి పంటకు ఎకరాకు రూ. 800, మొక్కజొన్న ఎకరాకు రూ. 660, కంది పంట ఎకరాకు రూ. 400, మినుము ఎకరాకు రూ. 190 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వరి పంటను గ్రామం యూనిట్‌గా, మొక్కజొన్న, కంది, మినుము పంటలను మండలం యూనిట్‌గా పరిగణిస్తారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు బీమా పరిహారం అందుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పగిడ్యాల: వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో కలిసి అతిసారం నుంచి మీ పిల్లలను రక్షించుకోండి అనే వాల్‌పోస్టర్లను విడుదల చేసి ర్యాలీ చేపట్టారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైనందున భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు అంటురోగాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. సబ్‌సెంటర్ల వారిగా ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కాచి వడగట్టిన నీటిని తాగాలని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే.. ప్రభుత్వం నిర్దేశించిన నెలవారి లక్ష్యాలను కూడా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తల రికార్డులను పరిశీలించారు. దంత వైద్యుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, సీఏహెచ్ఓ రామగుర్రప్ప, పీహెచ్ఎన్ మల్లేశ్వరి, హెల్త్‌సూపర్‌వైజర్ శివగౌరి పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం


పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫి

నందికొట్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే తిప్పి కొట్టేందుకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ ఎస్ఎండీ రఫి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. శాస్త్రీయ విద్యా సాధన కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు.నాయకులు మద్రిస్వామి, నవీన్ కుమార్, రవి, వంశీ, హరి, రమేష్, షాహీద్, వినయ్ పాల్గొన్నారు.

కౌలు కార్డు తీసుకోవాలి

కొత్తపల్లి : గ్రామాల్లో పొలాలను కౌలు తీసుకొని పంటలు వేసుకుంటున్న రైతులు కౌలు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారి అమీరున్నిసా తెలిపారు. మంగళవారం మండలంలోని కొక్కెరంచ, దుద్యాల గ్రామ రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. రైతు లు పంట మార్పిడి పద్ధతి పాటించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి ఈ– కేవైసీ చేసుకోని రైతులు వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. వాతావరణం ఆధారంగా పత్తి, వేరుశనగ, అరటి సాగు చేసే రైతులు పంటల బీమా చేసుకోవాలని సూచించారు. పత్తి పంటకు ఎకరాకు రూ.1600, వేరుశనగకు రూ.560, అరటి రూ.2,750 చొప్పున ప్రీమియం చెల్లించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్కల బెడదను అరికట్టాలి

ఆత్మకూరు: పట్టణంలో పిచ్చికుక్కల బెడదను అరికట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తోటగేరి, పెద్దపీర్ల వీధి, అప్పలరావు వీధి, పాత బస్టాండ్, గరీబ్‌నగర్, తహసీల్దార్ కార్యాలయం వద్ద సుమారు 20 మందిపై రెండు రోజుల క్రితం కుక్కలు దాడులు చేశాయన్నారు. వారంతా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి రోజూ పట్టణంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి ఘటనలు జరుగుతునే ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు పిచ్చికుక్కల బెడద నుంచి కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, భాస్కర్, సద్దాంహుసేన్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవనం స్థలం మంజూరుకు వినతి

ఆత్మకూరు: శ్రీశైలంలో బీసీ భవనం కోసం స్థలం మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి మన్నెం బాలస్వామి తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రత్నరాధికను కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో బీసీ భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలుడిపై పిచ్చి కుక్క దాడి

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది స్కూల్ వద్ద విద్యార్థిపై పిచ్చి కుక్క మంగళవారం దాడి చేసింది. నాల్గవ తరగతి చదువుతున్న రోహన్ అనే బాలుడు పాఠశాల మైదానంలో ఆటాడుకుంటుండగా పిచ్చి కుక్క కరిసింది. దీంతో తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

ఆదోని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: కర్నూలు జిల్లా ఆదోని మండలం ధణాపురం గ్రామంలో దళిత సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నాయకురాలు గుడిసె క్రిష్ణమ్మపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మకూరులోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు దళితులను అవమానించడం తగదన్నారు. ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లె ఎలిసా, మురారి మల్లయ్య, దరగయ్య, బుజ్జన్న, చింతలయ్య, రవికుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులపై గైడ్‌లైన్స్ ఇచ్చి బదిలీలు చేపట్టాలి


పీఆర్ ఏఈ బషీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

జూపాడుబంగ్లా: సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పదోన్నతులపై స్పష్టమైన మార్గనిర్దేశకాలు జారీ చేసిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ బషీర్‌కు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2019 నుంచి ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఇప్పటిదాకా స్పష్టమైన ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయకపోవటం సరికాదన్నారు. అలాగే తాగునీరు, గృహనిర్మాణ, సర్వశిక్షాభియాన్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన ఇంజినీరింగ్ పనులను పర్యవేక్షించటంతో పాటు పలురకాల ప్రభుత్వ సర్వేలు చేస్తూ తమపై పని భారం మోపడం తగదన్నారు. గ్రామసచివాలయాలను క్లస్టర్లుగా విభజించటంతో పాటు రెండు, మూడు సచివాలయాలకు ఓ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను నియమిస్తే పని ఒత్తిడి అధికమవుతుందన్నారు. ఇది ఆర్టికల్–14కు విరుద్ధమన్నారు. క్లస్టర్ల విభజన అనంతరం మిగిలిన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఏ శాఖలో ఏ పోస్టు కేటాయిస్తారనే విషయమై ప్రభుత్వం ఇప్పటిదాకా స్పష్టత ఇవ్వలేదన్నారు. మండల సచివాలయ ఉద్యోగుల అధ్యక్షుడు సోహెల్, ట్రెజరర్ వేణుగోపాల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మనోజ్‌కుమార్, వినోద్‌కుమార్, రంజిత్, నిర్మల, శికామణి, నరసింహ, జయరాం, విజయ్‌బాబు పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణతో మోక్షం


మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

నందికొట్కూరు: రామతారక మంత్రం సర్వజీవులకు మోక్షం ప్రసాదిస్తుందని తిరుమల,తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మిడుతూరు మండల కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో నాలుగు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీమద్రామాయణములోని వివిధ పాత్రలు సమాజానికి ఎలా అన్వయం చేసుకోవాలి, వాటిలోని ఆదర్శాలు, లోక నీతిని దృష్టాంతాలతో వివరించారు. భక్తుడు సురేష్‌బాబు, ధర్మ ప్రచారకులు చెంచు రామ్మోహన్‌రావు, భజనమండలి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, చిట్టిబాబు, భజన నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

ఆత్మకూరు: విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని థెరిస్సా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుట్కా, సారాయి, గంజాయి, డ్రగ్స్ వంటి వాటి జోలికెళ్లకూడదన్నారు. వాటి ద్వారా జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఎవరైనా మాదక ద్రవ్యాలకు పాల్పడినా, అమ్మినా, సరఫరా చేసినా అలాంటి వారి సమాచారాన్ని 9440902585, 8328307774, 9177299067 నంబర్‌లకు అందించాలని సూచించారు.

ఉచిత స్పర్శదర్శన క్యూలైన్ల పరిశీలన


క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థాన ఉచిత క్యూలైన్లను కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుత ఉచిత దర్శనం క్యూలైన్ ద్వారానే స్పర్శదర్శనం భక్తులను కూడా అనుమతించాలన్నారు. ఉచిత స్పర్శదర్శనం భక్తులు వేచివుండేందుకు ప్రత్యేకంగా హోల్డింగ్ ఏరియా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీబాలకృష్ణను ఆదేశించారు. టోకెన్లను అందజేసేందుకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. టోకెన్లలో భక్తుడి పేరు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు. ఉచిత స్పర్శదర్శనం వేళల గురించి భక్తులకు స్పష్టంగా తెలిసే విధంగా మైకు ద్వారా తెలియజేస్తుండాలని సూచించారు. సహాయ కార్యనిర్వహణాధికారులు ఎం.హరిదాసు, మల్లికార్జునరెడ్డి, స్వాములు ఉన్నారు.

అన్నప్రసాదంలో నాణ్యత తప్పనిసరి

అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అన్నప్రసాదాలకు వినియోగిస్తున్న కూరగాయలు, స్టోరులోని సరుకుల నాణ్యతను పరిశీలించారు. ప్రతి రోజు తాజా కూరగాయాలను మాత్రమే వాడాలన్నారు. సిబ్బంది భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పాములపాడు : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. మంగళవారం ఎంపికైన విద్యార్థు లకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బాలాజీ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించే విజయం తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు గుర్తింపు వస్తుందన్నారు. నూజివీడు క్యాంపస్‌కు మల్లన్న, యశస్విని, హైమావతి,పూజిత అనే నలుగురు విద్యార్థులు. ఒంగోలు క్యాంపస్‌కు శ్రావణి, ముర్తుజావలి ఎంపికయ్యారని వివరించారు.